మన్నించయ్యా.. గణపయ్య
2





2
సాంఘిక బహిష్కరణ సరికాదు

AKSHARA TODAY
అక్షర చూటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com

జీజీహెచ్‌కి బడ్జెట్‌ను వెంటనే విడుదల చేయాలి



అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ జీజీహెచ్‌లో 750 పడకలకు వెంటనే బడ్జెట్ కేటాయించి, కార్మికుల సంఖ్యను పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై. ఓమయ్య, మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి. సుధాకర్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన వి లేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి ఫెరోజ్, యూనియన్ నాయకులు స్వరూప, కవిత, భారతి, పవిత్ర, సాయి, వెంకటేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌లో రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : జిల్లా సైక్లింగ్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27, 28 తేదీలలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో "అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ - రోడ్ సైక్లింగ్" పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జీవీ కృపాకర్ రెడ్డి, భూలోకం విజయ్ కాంత్ రావు తెలిపారు. మహిళల్లో సైక్లింగ్ క్రీడపై ఆసక్తిని పెంపొందించడం, వారి ప్రతిభను వెలికితీయడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. మహిళా ఎలైట్ విభాగంలో 19 నుండి 40ఏళ్ల మధ్య ఉన్న మహిళలు అర్హులని తెలిపారు. జూనియర్ బాలికల విభాగంలో 15 నుండి 18ఏళ్ల వయస్సు గల బాలికలు (20082011 మధ్య జన్మించిన వారు) అర్హులని పేర్కొన్నారు. (క్రీడల్లో పాల్గొనే క్రీడాకారిణులు తమ సొంత సైకిళ్లు, రక్షణ పరికరాలను తెచ్చుకోవాలని ప్రతినిధులు పేర్కొన్నారు. పోటీదారులకు 'ఖేలో ఇండియా గుర్తింపు సంఖ్య' (KID) తప్పనిసరని.. గుర్తింపు సంఖ్య లేనివారు 'ఎన్ఎస్ఆర్ఎస్' అంతర్జాల వేదిక ద్వారా నమోదు చేసుకుని గుర్తింపు పొందాకే పోటీలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



రెడ్‌క్రాస్ ఎన్నికల్లో దీకొండ యాదగిరి ప్యానెల్ పోటీ

అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: రెడ్‌క్రాస్ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ జోరుగా సాగుతుంది. ఈసారి ఎన్నికలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా చార్టెడ్ అకౌంటెంట్ దీకొండ యాదగిరి ఆధ్వర్యంలో ప్యానెల్ ఏర్పాటు చేసుకున్న సభ్యులు పోటీలో నిలబడ్డారు. ఈ ప్యానెల్‌లో దీకొండ యాదగిరితో పాటు ఫుడ్ బ్యాంక్ ప్రతినిధి పురుషోత్తం రెడ్డి, వ్యాపారి కొండా సత్య ప్రసాద్, శివాజీ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు, న్యాయవాదులు జగన్మోహన్ గౌడ్, బాలాజీ చౌహాన్, అనిల్ కుమార్, మింకి వేణుగోపాల్, వైద్యులు శ్రీను నాయక్, విద్యావేత్త రాజులదేవ్ రఘునాథ్ తదితరులు పోటీ చేయనున్నారు.

నామినేషన్ వేసిన జగన్ మోహన్ గౌడ్

రెడ్‌క్రాస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పోటీ చేసేందుకు న్యాయవాది మల్లెపూల జగన్మోహన్ గౌడ్ ముందుకొచ్చారు. గురువారం రెడ్‌క్రాస్ జిల్లా కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సేవలను జిల్లాలో ఇంకా మరింత పటిష్టం చేయడం కోసం కృషి చేస్తానన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు తనకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

కామారెడ్డి రెడ్‌క్రాస్ ఎన్నికలకు 31 నామినేషన్లు



అక్షరటుడే, కామారెడ్డి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కామారెడ్డి జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలకు 31 నామినేషన్లు దాఖలయ్యాయి. గురువారం కామారెడ్డి కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నిర్వహించగా, మొత్తం 15 మేనేజింగ్ కమిటీ సభ్యుల పదవులకు 31 నామినేషన్లు వచ్చినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 25న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్ల పరిశీలన, సెప్టెంబర్ 26న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారి పి. రామమోహన్, ఉప ఎన్నికల అధికారి తెలిపారు.

ఉద్యోగులకు సర్వీస్ బుక్‌లు ఎంతో కీలకం. రిటైర్మెంట్ వరకు చేసిన సేవలకు సర్వీస్ బుక్ ఉద్యోగి పనితీరును చూపిస్తుంది. భవిష్యత్తులో వచ్చే బెనిఫిట్స్ అన్నీ సర్వీస్ బుక్‌తోనే ముడిపడి ఉంటాయి. దీంతో ఈ బుక్ అంశానికి అత్యంత ప్రాధాన్యత ఏర్పడుతోంది. ఉద్యోగం వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా కొందరి సర్వీస్ బుక్‌లు పెండింగ్ ఉండటం వెనక ఆంతర్యం ఏమిటన్న చర్చ సాగుతోంది.

– అక్షరటుడే, కామారెడ్డి



విచారణ జరిగేనా..? సూత్రధారులు దొరికేనా..?

■ సర్వీస్ బుక్స్ పెండింగ్ లో ఉండటానికి కారణాలేమిటో..? ■ గతంలో బుక్స్ తీసుకెళ్లినా తిరిగి వచ్చిన వైనం ■ జీజీహెచ్‌లో వసూళ్లపై అనేక అనుమానాలు ■ తెరవెనుక చక్రం తిప్పేది ఎవరో తెలిసేనా..?

కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో అక్రమ వసూళ్ల అంశం అనేక అనుమానాలు రేకెత్తిస్తోంది. వసూళ్ల అంశం మొత్తం సర్వీస్ బుక్కుల చుట్టూనే తిరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో సర్వీస్ బుక్కులను ఉన్నతాధికారుల కార్యాలయానికి తీసుకెళ్లినా, అవి తిరిగి రావడం వెనుక డబ్బులు ఇవ్వకపోవడమే కారణమన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అసలు ఈ సర్వీస్ బుక్కుల అంశం ఏమిటన్నది తేల్చాల్సిన అవసరం ఉన్నతాధికారులు నియమించిన విచారణ కమిటీపై పడింది. జీజీహెచ్‌లో వసూళ్లకు పాల్పడుతున్నది ఎవరు, తెరవెనుక చక్రం తిప్పుతున్నది ఎవరన్నది తేలాల్సి ఉంది.

కారణాలపై అనుమానాలు

కామారెడ్డి జీజీహెచ్‌లో 2024లో కొత్తగా 203 మంది నర్సులను రిక్రూట్ చేశారు. ఇందులో ఇద్దరు బదిలీ కాగా 199 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో కూడా కొంతమందిని డిప్యూటేషన్ పై పంపించారు. 199 మంది బాధ్యతలు చేపట్టి దాదాపు రెండున్నరేళ్లు కావస్తోంది. వీరందరికి ప్రభుత్వం నుంచి సర్వీస్ బుక్స్ రావాల్సి ఉంది. కానీ ఇంకా పెండింగ్‌లోనే ఉండటం గమనార్హం.

సర్వీస్ బుక్స్ రిటర్న్..?

గతంలో సర్వీస్ బుక్స్‌కు కావాల్సిన డాక్యుమెంట్స్ అన్ని ఫైల్ రూపంలో తయారు చేసి డీఎంఈ కార్యాలయానికి తీసుకుని వెళ్లినట్టుగా తెలుస్తోంది. తీసుకెళ్లిన ప్రతిసారి ఫైల్స్ తిరిగి వచ్చాయని, ఇలా ఒకసారి రెండుసార్లు కాదని ఏకంగా ఆరుసార్లు తిరిగి వచ్చాయని సమాచారం. దాంతో అనుమానాలు కలుగుతున్నాయి. డాక్యుమెంట్స్ మొత్తం ఫైల్ రూపంలో తయారు చేసుకుని డీఎంఈ కార్యాలయానికి తీసుకెళ్లినప్పటికి రిటర్న్ ఎందుకు వచ్చాయన్నది తేలాల్సి ఉంది.

డబ్బులు ఇవ్వనందుకే రిటర్న్..?

గతంలో సర్వీస్ బుక్కుల కోసం రూ.6 వేలు చొప్పున వసూలు చేసినప్పటికి ఫిర్యాదుల నేపథ్యంలో ఆ నగదు జీజీహెచ్ దాటి వెళ్లలేకపోయాయి. ఇతర జిల్లాల్లో మాత్రం ఫైల్స్‌తో పాటు డబ్బులు వెళ్లడం వల్లే సర్వీస్ బుక్స్ ప్రాసెస్ పూర్తయిందన్న ప్రచారం సాగుతోంది. కామారెడ్డి జిల్లాకు సంబంధించిన ఫైల్స్ మాత్రమే పెండింగ్ ఉండటానికి, రిటర్న్ చేయడానికి డబ్బులు చేరకపోవడమే ప్రధాన కారణమని ప్రచారం సాగుతోంది. మళ్లీ వారం రోజుల క్రితమే డీఎంఈ కార్యాలయానికి చేరినట్టుగా తెలుస్తోంది. ఈ సారి రూ.5 వేల చొప్పున వసూళ్లు చేపట్టారు.

విచారణలో సూత్రదారులు తేలేనా..?

జీజీహెచ్‌లో వసూళ్ల భాగోతాన్ని 'అక్షరటుడే' బయటపెట్టడంతో కలెక్టర్ స్పందించి ఐదుగురితో కమిటీ వేసినట్టుగా తెలుస్తోంది. అయితే ఈ కమిటీ విచారణ ఇంకా మొదలు కాలేదని సమాచారం. నర్సింగ్ స్టాఫ్‌ను మాత్రం పిలిచి విచారణ చేసినట్టుగా తెలిసింది. అయితే విచారణ కమిటీ ముందు డబ్బులు వసూలు చేసిన వ్యక్తులు వసూళ్లు చేయించిన వ్యక్తి పేరు చెప్తారా..? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలో కమిటీ చేసే విచారణ నిష్పక్షపాతంగా ఉంటుందా..లేదా తెలియాల్సి ఉంది.

పిల్లల ఆస్పత్రుల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి



అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: జిల్లాలో చిన్నారులకు వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు భద్రతా ప్రమాణాలు పక్కాగా పాటించాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా రిమ్స్ ఆసుపత్రిలో చోటుచేసుకున్న సంఘటనను దృష్టిలో ఉంచుకొని గురువారం ఆయన సీపీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రుల్లో చిన్నారుల భద్రత, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై ఆయన చర్చించారు. ప్రత్యేకంగా ఫైర్ సేఫ్టీకి సంబంధించిన అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రుల్లో అగ్నిమాపక పరికరాల అందుబాటు, వాటి పనితీరు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ అలారం వ్యవస్థ, విద్యుత్ భద్రత, సిబ్బందికి ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో రోగులను సురక్షితంగా తరలించే విధానం తదితర అంశాలను పరిశీలించారు. చిన్నారులు చికిత్స పొందుతున్న ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఆసుపత్రుల యాజమాన్యాలు భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్, ఫైర్ సర్వీసెస్, వైద్య సిబ్బంది సమన్వయంతో వేగంగా స్పందించే విధంగా అవసరమైన ఏర్పాట్లు, మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ అడ్మిన్ శుభం ప్రకాష్, డీఎంహెచ్‌వో రాజశ్రీ, జిల్లా ఫైర్ అధికారి పరమేశ్వర్, ఎన్ఎన్‌సీ ప్రెసిడెంట్ కవితారెడ్డి, డీసీహెచ్ఎస్ శ్రీనివాస ప్రసాద్, ఎలక్ట్రిసిటీ ఎస్ఈ పీవీ రాజేశ్వర్ రావ్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, ట్రాఫిక్, సీసీఆర్‌బీ ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్, మస్తాన్ అలీ, గురు నాయుడు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్ రెడ్డి, మల్లేశం పాల్గొన్నారు.



గణేష్ నిమజ్జన మార్గాన్ని పరిశీలించిన మేయర్

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నగరం లో గురువారం జరగనున్న గణపతి నిమజ్జన శోభాయాత్ర మార్గాన్ని మేయర్ కూరగాయల ఉమారాణి తనిఖీ చేశారు. మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్‌తో కలిసి ఆమె రథయాత్ర ప్రారంభం కానున్న దుబ్బ నుంచి గణపతుల బావి వరకు రోడ్డుమార్గాన్ని పరిశీలించారు. రథయాత్ర మార్గంలో.. అలాగే గణపతుల బావి వద్ద మార్గం లోని రోడ్ల పరిస్థితి, ట్రాఫిక్ సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, శోభాయాత్ర సజావుగా జరగడానికి అవసరమైన ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. లోపాలు ఉంటే వాటిని తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రేపు జరిగే నిమజ్జన శోభాయాత్ర భక్తులకు సురక్షితంగా, సజావుగా, భక్తి భావంతో జరగాలని మేయర్ అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో సిటీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, కార్పొరేటర్లు మనోహర్, నయీం, అమర్, సజ్జత్, కోఆప్షన్ సభ్యులు సరేందర్ సింగ్, అశోక్, అవిన్ తదితరులు పాల్గొన్నారు.


కామారెడ్డిలో ముగిసిన గణేష్ శోభాయాత్ర







అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి పట్టణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. బుధవారం రాత్రి 10 గంటలకు రైల్వే స్టేషన్ గణపతి శోభయాత్రను కలెక్టర్, ఎస్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రారంభించారు. గురువారం రాత్రి వరకు కూడా శోభాయాత్ర కొనసాగింది. పట్టణంలోని ధర్మశాల నుంచి ఇందిరాచౌక్, జీజీహెచ్, సుభాష్ రోడ్, జేపీఎన్ రోడ్డు, జయప్రకాష్ నారాయణ్ రోడ్డు, పెద్దబజార్ మీదుగా రైల్వే కమాన్, నిజాంసాగర్ చౌరస్తా మీదుగా సాగిన శోభాయాత్ర టేక్రియాల్ చెరువులో గణేష్ నిమజ్జనంతో ముగిసింది. శోభాయాత్ర సందర్భంగా పట్టణమంత సందడిగా మారింది. డోలక్ శబ్దాలతో పట్టణం మారుమ్రోగింది. టేక్రియాల్ చెరువు వద్ద గణేషుల నిమజ్జనం కోసం భారీ క్రేన్లను ఏర్పాటు చేశారు. మున్సిపల్, రెవిన్యూ, విద్యుత్, పోలీసు యంత్రాంగం చెరువు వద్ద పకడ్బందీ చర్యలు చేపట్టారు. చెరువు వద్దకు భక్తులను అనుమతించలేదు.







నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

అక్షరటుడే, ఆర్మూర్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని గుండ్ల చెరువులో నిమజ్జన ఏర్పాట్లను గురువారం ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గోనే లహరి రఘు పరిశీలించారు. నిమజ్జనం సందర్భంగా చెరువు ప్రాంతంలో విద్యుత్, క్రేన్లు, గజ ఈతగళ్ల ఏర్పాటుపై అధికారులతో ఆమె సమక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, కౌన్సిలర్ భారత్ గ్యాస్ సుమన్, మల్లయ్య, జోశ్రీను, మున్సిపల్ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని పాదయాత్ర



అక్షరటుడే, పెద్దకొడప్‌గల్: రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని ఏపీ హైకోర్టు అడ్వకేట్ (ప్రాక్టీస్) కాటూరి వెంకటేశ్వర్లు 'రాగా ఫర్ రైజ్ ఆఫ్ ఇండియా' పేరుతో పాదయాత్ర నిర్వహిస్తున్నారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు ఈ పాదయాత్ర జరుగుతోంది. దీంట్లో భాగంగా మండలంలోని బేగంపూర్ గేటు వద్ద మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాదయాత్రకు సంఘీభావం తెలుపుతూ వెంకటేశ్వర్లుకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మన్నించయ్యా.. మహా గణపయ్యా..

తొమ్మిదిరోజులు భక్తితో పూజలందుకున్న గణనాథులను గాంధారి మండలంలో గురువారం నిమజ్జనం చేశారు. అయితే వినాయకుల నిమజ్జనానికి అధికారులు చేసిన ఏర్పాట్లపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.
– అక్షరటుడే, గాంధారి

- మురికి నీళ్లలో నిమజ్జనం..!
- భక్తులకు తప్పని ఇబ్బందులు
- బతుకమ్మ పండగు వరకైనా
- పరిస్థితి మారాలంటున్న గ్రామస్తులు

గాంధారి మండలంలో గురువారం గణనాథుల నిమజ్జనోత్సవం ముగిసింది. మండలంలో 84 మండపాలు గణనాథులను ప్రతిష్ఠించాయి. అయితే మండలంలోని బాన్సువాడ-కామారెడ్డి రహదారిపై ఉన్న వంతెన వద్ద గణనాథులను నిమజ్జనం చేయగా.. అందులో ఉన్న నీళ్లను చూసి భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మాములు రోజుల్లోనే ఈ వంతెనపై నుంచి వెళ్లాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తుందేదని అలాంటిది ఏకంగా గణేష్ నిమజ్జనాన్ని ఆ ప్రాంతంలో నిర్వహించడం పట్ల మండలవాసులు అసహనం వ్యక్తం చేశారు.

సరైన చెరువు, నీటి వసతి లేకపోవడంతో..

రూ. లక్షలలో వినాయక విగ్రహాలను తీసుకొచ్చి భక్తితో పూజలు చేసిన భక్తులకు నిమజ్జనోత్సవం ఒకింత అసహనాన్ని మిగిల్చింది. నిమజ్జనం కోసం సరైన చెరువు, నీటి వసతి లేకపోవడంతో మురికి నీటిలోనే గణనాథుల నిమజ్జనం చేయాల్సిన దుస్థితి నెలకొంది. వినాయక విగ్రహాలను ఎంతో భక్తితో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన అనంతరం నిమజ్జనం సమయంలో మురికి నీటిలోకి తీసుకెళ్లాల్సి రావడంతో భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "మన్నించయ్యా ఓ మహా గణపయ్యా... భక్తితో పూజించాం.. చివరకు మురికి నీళ్లలో నిమజ్జనం చేయాల్సి వస్తోంది" అంటూ పలువురు భక్తులు బాధతో కార్యక్రమాన్ని నిర్వహించారు.

బతుకమ్మ వరకైనా పరిస్థితి మారితే..

రాబోయే రోజుల్లో బతుకమ్మ పండగకైనా పరిస్థితిలో మార్పు రావాలని పలువురు కోరుతున్నారు. అప్పటికైనా మురికినీళ్లలో కాకుండా మంచి నీళ్లలో బతుకమ్మలు వేసేలా స్థానిక అధికారులు ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో మహిళలకు ఇబ్బందులు కలిగించవద్దని కోరుతున్నారు.

పెద్ద చెరువు వద్దే..

వంతెన వద్ద కాకుండా గాంధారి ఊరికి నడిబొడ్డున పెద్ద చెరువులో నిమజ్జన ఏర్పాట్లు చేస్తే బాగుంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మోకరంపేట హన్మాండ్లు వద్ద ఏర్పాట్లు చేస్తే దూరం అవుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. పెద్దచెరువు వద్దే గణేష్ నిమజ్జనం, బతుకమ్మ పండుకు ఏర్పాట్లు చేస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం..

గాంధారి మండలంలోని మోకరంపేట హనుమాన్ చెరువు సుందరీకరణ చేయాలి. లేదంటే పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న పెద్ద చెరువులో కూడా గణేష్ నిమజ్జనం నిర్వహించవచ్చు. అయితే దీనికి సంబంధించి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుకు సమాచారం అందించాం. బతుకమ్మ పండుగ వరకు సానుకూలా స్పందన వస్తుందని ఆశిస్తున్నాం.

- రేణుక సంజీవ్, సర్పంచ్, గాంధారి

ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆత్మహత్యాయత్నం బాధాకరం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: జగిత్యాలలోని గొల్లపల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన తమను తీవ్రంగా కలిచివేసిందని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్ అన్నారు. ఉన్నతాధికారుల వేధింపులు, ఒత్తిడి భరించలేక ఆయన ఆత్మహత్యాయత్నం చేయడం తమను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నార. ఉపాధ్యాయులపై అధికారుల వేధింపులు, బోధనేతర పనులు, యాప్‌ల ఒత్తిడి రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.



బాధితుడికి ఎల్ఓసీ అందజేత

అక్షరటుడే, ముప్కాల్: మండలంలోని రెంజర్ల గ్రామానికి చెందిన గజ్జెల బ్రహ్మయ్య తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యులు శస్త్రచికిత్స చేయాలని సూచించడంతో వైద్య ఖర్చుల కోసం కుటుంబ సభ్యులు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్‌ను సంప్రదించారు. ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.3,50,000 విలువైన ఎల్ఓసీ మంజూరు చేయించినట్లు తెలిపారు. అనంతరం మంజూరైన ఎల్ఓసీని బాధిత కుటుంబానికి అందజేశారు. సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకున్న ముత్యాల సునీల్ కుమార్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

29న బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా



అక్షరటుడే, బాన్సువాడ: బాన్సువాడలోని ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈనెల 29న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందూరు గంగాధర్ తెలిపారు. టీఎస్ కేసీ, ఐక్యూఏసీ, ప్లేస్‌మెంట్ సెల్, మ్యాజిక్ బస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జాబ్ మేళాలో ఎస్సెస్సీ నుంచి డిగ్రీ వరకు విద్యార్హత కలిగిన అభ్యర్థులు పాల్గొని ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. వివిధ సంస్థల్లో అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను యువత వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందూరు గంగాధర్ మెగా జాబ్ మేళా బ్రోచర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ సెల్ సమన్వయకర్త తుమ్మ చిరంజీవి, కళాశాల టీఎస్ కేసీ, టాస్క్ సమన్వయకర్త గులాం ముస్తఫా, ఐక్యూఏసీ సమన్వయకర్త బున్ని వినయ్ కుమార్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్పొరేషన్‌లో గణనాథుడికి ఘనంగా పూజలు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్‌లో నగరపాలక సంస్థ గణేష్ మండలి ఆధ్వర్యంలో గురువారం అన్నదానం నిర్వహించారు. మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ ఉమారాణి మాట్లాడుతూ ఉత్సవాలు నిర్వహించడం ద్వారా సేవా కార్యక్రమాలకు నిర్వహించేందుకు అవకాశం లభిస్తుందన్నారు. నగరపాలక సంస్థ గణేష్ మండలి ద్వారా నిర్వహిస్తున్న ఈ అన్నదాన కార్యక్రమం పేదలు, అవసరమైన వారికి ఆహారం అందించడంలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. సమాజ సమరసత, సేవా భావం పెంపొందించే దిశగా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగాలని సూచించారు. కార్యక్రమంలో నుడా ఛైర్మన్ కేశ వేణు, మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, డీసీసీ ప్రెసిడెంట్ నాగేశ్ రెడ్డి, సిటీ ప్రెసిడెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి ఘన సన్మానం

అక్షరటుడే, గాంధారి: మండలంలోని జువ్వాడి గ్రామానికి చెందిన షేక్ జబ్రాన్ అలీ జయశంకర్ భూపాలపల్లి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించారు. గ్రామానికి చెందిన యువకులు విద్యార్థిని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించడం గ్రామానికి గర్వ కారణమని యువకులు పేర్కొన్నారు. జబ్రాన్ అలీ సాధించిన విజయం గ్రామంలోని ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని, కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని అన్నారు. భవిష్యత్తులో మంచి వైద్యుడిగా ఎదిగి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.




బాల్కొండలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని వినతి

అక్షరటుడే, బాల్కొండ: మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని సర్పంచుల సంఘం కోరింది. మండల సర్వసభ సమావేశంలో ఎంపీడీఓకు సర్పంచులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో పబ్లిక్ స్కూళ్లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, బాల్కొండ నియోజకవర్గంలో కూడా స్కూల్ మంజూరు చేయాలని కోరారు. పాఠశాల ఏర్పాటుకు జెడ్పీ హెచ్ఎస్ భవనాలు, ల్యాబ్‌లు, ఖాళీ స్థలాలను పరిశీలించాలని ఆర్మూర్ సబ్‌కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశామని సర్పంచ్ గాండ్ల రాజేష్ తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎంఈఓ హామీ ఇచ్చారన్నారు.



జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవం

అక్షరటుడే, బాల్కొండ : బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రజీయుద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే సేవా కార్యక్రమాల్లో పాల్గొనే అలవాటు పెంచుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సదా మురళి మాట్లాడుతూ యువత, విద్యార్థులు జాతీయ సేవా పథకం ద్వారా గ్రామాన్ని దత్తత తీసుకుని పరిసరాల పరిశుభ్రత, డ్రగ్స్ నివారణపై అవగాహన, అక్షరాస్యత పెంపు వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అధ్యాపకులు అనిత, గంగారం, సంతోష్, సాయి ప్రసాద్, రెహమాన్, రాజేష్, సీనియర్ అసిస్టెంట్ మురళీకృష్ణ శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.



బండారి విజయలక్ష్మి హాస్పిటల్‌లో అన్నదానం



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నగరంలోని బండారి విజయలక్ష్మి హాస్పిటల్‌లో గురువారం మహా అన్నదానం నిర్వహించారు. ఖలీల్‌వాడీలో ఉన్న బండారి గ్రూప్స్ విజయలక్ష్మి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ప్రాంగణంలో భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఆస్పత్రి వైద్యురాలు బండారి సుజాత, గాంధీ హాస్పిటల్ వైస్ ప్రిన్సిపాల్ నాగమోహన్ దంపతులు కలిసి వినాయకుడికి పూజా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ..ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా ఘనంగా వినాయకుడికి పూజా కార్యక్రమం, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. వినాయకుడికి కృపతో జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆ భగవంతున్ని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బండారి భోజన్న, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాంఘిక బహిష్కరణ సరికాదు

అక్షరటుడే, ఆర్మూర్: ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో కల్లు విషయంలో 39 మంది గౌడ కులస్తులను, 10మంది ఎస్సీ గీత కార్మిక కుటుంబాలను గ్రామంలో సాంఘిక బహిష్కరణ చేయడం హేయమైన చర్య అని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్ ఖండించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గీతా కార్మికులను సాంఘిక బహిష్కరణ పేరుతో గ్రామ అభివృద్ధి కమిటీ, గ్రామ ప్రజలు వేధించడం సరికాదన్నారు. సాంఘిక బహిష్కరణ సమస్యకు పరిష్కారం కాదని, కూర్చొని మాట్లాడడానికి, సమస్యను పరిష్కరించడానికి గ్రామాభివృద్ధి కమిటీ మాట్లాడడానికి తాళ్లరాంపూర్ రావడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. తాళ్లరాంపూర్ సాంఘిక బహిష్కరణను ప్రతి ఒక్కరు ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్మూర్ మండల గౌడ సంఘం అధ్యక్షుడు లింగం గౌడ్, గౌడ సంఘం నేతలు పూర్ణచందర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, గంగాధర్ గౌడ్, వన్నెల్ సురేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

అక్షరటుడే, ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వార్డులో గురువారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎనిమిదో వార్డు కౌన్సిలర్ సిద్ధి శ్రీధర్ గుప్తా పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. కౌన్సిలర్ మాట్లాడుతూ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, నిత్యావసర సరుకులు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమైంది.

